క్లుప్తంగా

మహిళలు వ్యాపారవేత్తగా ఎదగాలి

అదనపు డీఆర్డీఓ సూర్యారావు



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యారావు

సంగారెడ్డి టౌన్‌: గ్రామీణ ప్రాంతంలోని మహిళలు సమాజంలో వ్యాపారవేత్తలుగా ఎదగాలని అదనపు డీఆర్డీఓ సూర్యారావు అన్నారు. శనివారం సంగారెడ్డి పట్టణంలోని కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని మహిళల సంఘాలకు బ్యాంకుల నుంచి రుణాలను అందిస్తూ శిక్షణ నైపుణ్యాలను కల్పిస్తూ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ గీత, మాధవి, మహిళా సంఘం మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎమ్మెల్యే నివాళి



సర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్‌: జహీరాబాద్‌లోని బాబు మోహన్ కాలనీలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ 14వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్‌లు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్‌సార్ తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేశారని, రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సూచనలు, సలహాలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, ఈశ్వర్‌రెడ్డి, బండి మోహన్, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు సిద్ధకండి: ఎంపీడీఓ



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వట్‌పల్లి(అందోల్‌): వన మహోత్సవానికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ అంజయ్య అన్నారు. శనివారం ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీల్లోని మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురవగానే గ్రామ నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలన్నారు. రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో నాటిన మొక్కల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ప్రతి గ్రామంలో కూలీలకు విధిగా పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గోడౌన్‌లో అగ్ని ప్రమాదం



గోడౌన్లో చెలరేగిన మంటలు

జిన్నారం (పటాన్‌చెరు): షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్లాస్టిక్ గోదాం అగ్ని ప్రమాదం జరిగిన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఐడియా బొల్లారం పారిశ్రామికవాడలోని ఓ ప్లాస్టిక్ గోడౌన్‌లో శుక్రవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గోదాం ఆవరణలో నివాసం ఉంటున్న కార్మికులు పోలీసులకు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు.

హెల్పర్‌కు తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్‌: రియాక్టర్ వద్ద పనిచేస్తున్న ఓ హెల్పర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ కథనం ప్రకారం ...బీహార్‌కు చెందిన ధర్మరాజు బతుకుదెరువు కోసం వచ్చి పాశమైలారంలో ఉంటూ, స్థానికంగా కోరల్ పెట్రో ప్రొడక్ట్స్ (పీవీసీ రా మెటీరియల్) పరిశ్రమలో రియాక్టర్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రియాక్టర్ వద్ద పనిచేస్తుండగా అందులో ఉన్న కెమికల్ ఓవర్ ఫ్లో అయి ధర్మరాజుపై పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన ధర్మరాజును చికిత్స కోసం ఇస్నాపూర్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య యోగం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, ఆయా కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ నిరంతర అభ్యాసంగా మార్చుకోవాలన్నారు. యోగా సాధనతో మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.



పటాన్‌చెరు: యోగాడేలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



జహీరాబాద్ టౌన్‌: మహీంద్ర అకాడమీలో..



పుల్‌కల్: బస్వాపూర్ మోడల్ స్కూల్‌లో..



నారాయణఖేడ్: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



న్యాల్‌కల్‌లోని జిల్లా పరిషత్తు పాఠశాల ఆవరణలో..



పటాన్‌చెరు టౌన్‌: రెసోనెన్స్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు



జహీరాబాద్‌లోని ఆదర్శ విద్యాలయంలో..



మునిపలి: తాటిపల్లి యునైటెడ్ స్కూల్‌లో..



సంగారెడ్డి టౌన్‌: జిల్లా కోర్టులో యోగా వేడుకలో..



సంగారెడ్డి క్రైమ్: యోగా భవన్‌లో..



కల్హేర్: సిర్గాపూర్‌లో..

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి



రాయికోడ్: ఇంటి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా బీసీ సంక్షేమాధికారి జగదీశ్

రాయికోడ్(అందోల్‌): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని మండల ప్రత్యేకాధికారి జిల్లా బీసీ సంక్షేమాధికారి జగదీశ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం రాయికోడ్‌లో ప్రారంభించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల మంజూరు పొందిన లబ్ధిదారులు విధిగా అధికారులను సంప్రదించి తక్షణం నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలన్నారు. దశలవారీగా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అంతకుముందు స్థానిక బీసీ హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్‌లో కొనసాగుతున్న పెయింటింగ్, వరండా నిర్మాణ పనులను పరిశీలించారు. హాస్టల్‌లోని గదులను పరిశీలించి విద్యార్థుల అడ్మిషన్‌లు పెంచాలని వార్డెన్ శారదను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్, పంచాయతీ కార్యదర్శులు శివశంకర్, గోపి ఉన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల తీరును నిజాంపేట్ ఎంపీడీఓ సంగ్రాం శనివారం పలు గ్రామాల్లో పరిశీలించారు. మండలంలోని మునిగేపల్లి, రాంచెందర్ తండా, నిజాంపేట్ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న పనులు పర్యవేక్షించారు. ప్రభుత్వ నిర్దేశిత ప్రకారం ఇళ్లను నిర్మిస్తున్నారా లేదాని పరిశీలించారు. బేస్‌మెంట్ నిర్మాణం తీరు పరిశీలించి పలు సూచనలు చేశారు. వర్షాకాలం అయినందున త్వరగా పనులు పూర్తి చేసుకోవాలని, బేస్‌మెంట్ బిల్లులు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్‌లో శ్రీరామ మందిరం ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. అభిషేకం, ప్రత్యేక అలంకరణ, హారతి, స్వామివారికి పట్టు వస్త్రాలతో ఊరేగింపు నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లచ్చవ్వ, పీఎసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వీర్‌శెట్టి, గ్రామ ప్రముఖులు కిషన్‌రావు, రఘువీర్ పాల్గొన్నారు.

నూతన నియామకం

మునిపల్లి(అందోల్‌): పీఆర్టీయూ మండల ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శిగా సురేందర్‌ను ఎంపిక చేసినట్లు పీఆర్టీయూ మండల అధ్యక్షుడు చంద్రమౌళి శనివారం పేర్కొన్నారు. అలాగే కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్య వర్గ సభ్యులుగా ఉమేశ్, వీరన్న, శ్రీకాంత్, సిద్ధేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, గుణాకర్, భాస్కర్‌రెడ్డి, వీరయ్య, కృష్ణ, భాను ప్రకాశ్‌లను ఎన్నుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వం నుంచి మంజూరయిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే సునీతారెడ్డి శుక్రవారం బాధ్యత కుటుంబీకులకు అందజేశారు. హత్నూర మండలం లింగాపూర్‌కు చెందిన బక్కని కవితకి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.28,000 చెక్కును ఎమ్మెల్యే సునీతారెడ్డి లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో లింగాపూర్ గ్రామానికి చెందిన నాయకులు ఉన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ పరిశుభ్రతపై అవగాహన



నారాయణఖేడ్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ సూచించారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా మన్సుర్‌పూర్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని, ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా బుట్టల్లో చేయాలన్నారు. అనంతరం సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పించా రు. పట్టణంలో దోమలు వ్యాప్తించకుండా మురుగుకాల్వల్లో యాంటిలార్వా రసాయన ద్రావణాన్ని పిచికారీ చేశారు. బ్లీచింగ్ పౌడరు చల్లారు, వరదనీరు నిలిచిన ఖాళీస్థలాల్లో ఆయిల్ బంతులు వదిలారు.

◆ 'బస్తీ దర్శన్'తో సమస్యలు పరిష్కారం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో శనివారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బస్తీదర్శన్ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పుష్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో బోర్‌వెల్‌కు భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాలనీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అమృత్‌సాగర్, కాలనీవాసులు నరేంద్రబాబు, ప్రభాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్ నాయక్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

◆ కురుమ సంఘం మండల అధ్యక్షుడిగా యాదగిరి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో జిల్లా కురుమ సంఘం కోఆర్డినేషన్ సభ్యుడు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో శనివారం రామచంద్రాపురం మండల కురువ సంఘం నూతన కమిటీను ఎన్నుకున్నారు. మండల కురుమ సంఘం అధ్యక్షుడిగా యాదగిరి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా రవికుమార్, సహాయ కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా అశోక్, సలహాదారుగా మల్లేశ్‌లను ఎన్నుకున్నారు. కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.నాగేష్, రాష్ట్ర కురుమ సంఘం ఎన్నికల కమిటీ సభ్యులు ధనసిరి ప్రకాశ్ పాల్గొన్నారు.

◆ బ్యాగుల వితరణ

నారాయణఖేడ్: విద్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని మనూరు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. మనూరు మండలం తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో సేవోద్గం ఫౌండేషన్ సభ్యులు జయశ్రీ, కార్తీక్, చంద్రశేఖర్ ఆచార్య ఆధ్వర్యంలో బ్యాగులు, నోటు బుక్స్, ఇతర విద్యాసామగ్రిని మనూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకాష్‌రావుతో కలిసి ఎస్ఐ పంపిణీ చేశారు.

◆ వృథాగా పోతున్న నీరు



మునిపల్లి(అందోల్‌): మిషన్ భగీరథ పైపులైన్ నుంచి నీరు వృథాగా పోతుంది. శనివారం మండలంలోని మన్‌సాన్‌పల్లి, పెద్దచల్మెడ శివాకు చీలవాగు బ్రిడ్జిపై నుంచి తాటిపల్లి మీదుగా వివిధ మండలాలు, గ్రామాలకు ఏర్పాటు చేసిన పైపులైన్ పగిలి నీరు వృథా పోతుంది. పాత పైపులైన్ తొలగించి కొత్తగా ఏర్పాటు చేసిన పైపులైన్ నుంచి నీరు వృథాగా పోతుండడంతో సంబంధిత అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. తాగడానికే నీరు లేక ఇబ్బంది పడుతుంటే పైపులైన్ నుంచి వచ్చే నీరు వృథా పోతున్న సంబంధిత అధికారులు మరమ్మతుచేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేసి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

ఖైదీలకు సౌకర్యాలు కల్పించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

సంగారెడ్డి టౌన్‌: జైలులోని ఖైదీలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర అన్నారు. శనివారం కంది సెంట్రల్ జైలును తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖైదీలకు భోజనం, గదులు, పరిశుభ్రంగా ఉండేలా చూడాలని జైలు అధికారులను ఆదేశించారు. ఖైదీలతో మాట్లాడిన వారి సమస్యలు తెలుసుకున్నారు. గదులను పరిసరాలను తనిఖీలు చేశారు. బెయిల్స్, మూలఖాత్ తొందరగా అందేలా చూడాలని కేసులు తొందరగా పరిష్కరించేందుకు న్యాయవాదులు లేని వారికి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థకు అర్జి పెట్టుకుంటే ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. ఖైదీలు తినే రోజువారి మెనూను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య, జిల్లా జైలు సూపరింటెండెంట్ సాగర్, జైలు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం పోరాడుదాం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ, ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్‌: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం యోగా డేను పురస్కరించుకుని పటాన్‌చెరు మైత్రి మైదానంలో నిర్వహించిన యాంటి డ్రగ్స్ నివారణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే మత్తు పదార్థాల దుష్ఫలితాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ కల్చర్ ఎక్కువగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు బాధ్యతగా డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయకరెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలను వినియోగించడం, సరఫరా చేయడం చట్టరీత్యా నేరమని వారు పేర్కొన్నారు. మత్తు పదార్థాల బారిన పడడంతో యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతుంది. యువతీ యువకులు వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీడీఎల్ సీఐ స్వామిగౌడ్, అమీన్‌పూర్ సీఐ నరేష్, జిన్నారం సీఐ రవీందర్ రెడ్డి, ఎస్ఐలు సుభాశ్, మహేశ్వర్ రెడ్డి, శ్రీశైలం, కానిస్టేబుల్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే డ్యూటీ మీట్

ఎస్పీ పరితోశ్ పంకజ్



డ్యూటీమీట్‌లో పాల్గొన్న అధికారులు

సంగారెడ్డి జోన్‌: పోలీసు అధికారులలోని ప్రతిభను వెలికి తీసేందుకే పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ పరితోశ్ పేర్కొన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాస్థాయి రెండవ డ్యూటీమీట్ నిర్వహించారు. అందులో భాగంగా కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, పోలీస్ జాగిలాల ట్రాకింగ్, ఎక్స్‌ప్లోసివ్ విభాగంలో ఫొటో, వీడియోగ్రఫీలలో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రాణించిన వారిని జోనల్ స్థాయిలో నిర్వహించే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం ఎంతో అవసరమన్నారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేశ్



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘం సభ్యులు

జోగిపేట(అందోల్‌): ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జోగిపేట ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు రంగ సురేష్‌గుప్తా అన్నారు. శనివారం జోగిపేటలోని వాసవీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గానికి జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు జూకంటి లక్ష్మణ్ గుప్తా ప్రమాణ స్వీకారం చేయించారు. జోగిపేట సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన రంగ సురేష్ గుప్తా మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను చేపడతామన్నారు. సంఘం అభివృద్ధి విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లికార్జున గుప్తా, మాజీ కౌన్సిలర్ పి. రేఖాప్రవీణ్‌కుమార్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ కమిటీ సభ్యుడు ఎ.రాంబాబు, 13వ వార్డు వెల్ఫేర్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.రాజు, సలహాదారులు అల్లె మహేశ్, సోమేశ్వర్, సత్యం పాల్గొన్నారు.

పూడికతీత పనులు షురూ

జహీరాబాద్ టౌన్‌: వర్షాకాలం ప్రారంభమైనందున ముందు జాగ్రత్తగా వరద ముంపు లేకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు పూడికతీత పనులు శనివారం ప్రారంభించారు. జహీరాబాద్ పట్టణంలో లక్ష జనాభా ఉన్నారు. చిన్న వర్షానికే లోతట్టు కాలనీలు ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని మురికి నీరంతా పెద్ద కాలువ గుండా బైపాస్ రోడ్డు వైపు వెళ్లుతుంది. పెద్ద కాలువలో పూడికపేరుకుపోయి మురికి నీరు రోడ్డుపైకి వస్తుంది. పట్టణంలోని చెన్నారెడ్డి నగర్, వసంత్ విహార్, డ్రీమ్ వ్యాలీ తదితర ప్రాంతాలు వర్షాలకు ముంపునకు గురవుతుంటాయి. జేసీబీల సహాయంతో పూడిక పనులు చేస్తున్నారు.



పెద్ద కాలువలో చేపడుతున్న పూడికతీత పనులు

ప్రైవేటు ఆగడాలను కట్టడి చేయండి


నారాయణఖేడ్: ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాల ఆగడాలను కట్టడి చేయాలని బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అధిక ఫీజులు, యూనిఫాం, విద్యాసామగ్రి పేరిట అధికంగా వసూలు చేస్తూ విద్యను వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. విద్యాహక్కుచట్టం ప్రకారం 25 శాతం సీట్లను పేదల పిల్లలకు కేటాయించి ఉచితంగా విద్యను అందించాల్సి ఉండగా అమలుకు నోచుకోవడం లేదన్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఆయా పాఠశాలలు, కళాశాలల ఆగడాలకు అడ్డులేకుండా పోయిందన్నారు.



రమేష్ చౌహాన్

చదువే భవిష్యత్తుకు పునాది

ప్రత్యేకాధికారి జగదీష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఓ జగదీశ్

రాయికోడ్(అందోల్‌): పిల్లలను చదివించి వారి భవిష్యత్తుకు పునాదులు వేయాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్ అన్నారు. రాయికోడ్‌లోని ఐకేపీ భవనంలో శనివారం ఆయన మాట్లాడారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా చదువు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన విద్యను అందిస్తోన్నట్లు తెలిపారు. ఒక మహిళా విద్యావంతురాలు అయితే వారి కుటుంబం బాగుపడుతుందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను మహిళల ప్రాధాన్యంగా అమలు చేస్తోందన్నారు. నిరుపేద కుటుంబాలకు మహిళా సంఘం ద్వారా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రుణం ఉపయోగపడేలా గ్రామ సమాఖ్య అధ్యక్షుడు చొరవ చూపాలన్నారు. మండలంలోని సంఘాల సంఖ్య, పొందిన రుణాల వివరాలను ఏపీఎం నర్సింలు ఎస్ఓకు వివరించారు. గ్రామాల్లోని తాగునీటి సమస్యను తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు అంబిక, వీరమణి, ఎంపీఓ అంజలిదేవి, సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి ఉన్నారు.